

వారాహి మాతకు పూజలు

విశాఖ: అల్లిపురంలో వెలసిన శ్రీ వారాహి అమ్మవారిని గంధం, బాదం పప్పుతో విశేషంగా అలంకరించారు.



అప్పన్నకు ఆర్జిత సేవలు

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. స్వర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు.

గరిష్ఠం/కనిష్ఠం 33.3/25.5

వాతావరణం

తేలికపాటి నుంచి మోస్తరు వర్షం ఒకటి రెండు చోట్లపడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

న్యూస్‌రీల్

విశాఖ రేంజ్ డీఐజీగా గోపీనాథ్ జట్టి



సాక్షి, విశాఖపట్నం : విశాఖ రేంజ్ డీఐజీగా గోపీనాథ్ జట్టి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. 2008 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన గతంలో చింతపల్లి సబ్ డివిజన్ ఏఎస్పీగా పనిచేశారు. 2015లో తిరుపతి అర్బన్ ఎస్పీగా, 2018 వరకు కర్నూల్ ఎస్పీగా పనిచేశారు. అనంతరం తిరుపతి చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారిగా ఐదేళ్ల పాటు పనిచేశారు. అనంతరం డీఐజీగా పదోన్నతి పొందారు. ప్రస్తుతం గ్రే హౌండ్స్‌లో డీఐజీగా విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ పనిచేసిన విశాల్ గున్నినీ డీజీపీ కార్యాలయాన్ని అటాచ్ చేశారు.

సీఆర్‌పీఎఫ్‌లో అగ్నివీర్‌లకు ప్రాధాన్యం



నేవల్ సివిలియన్స్ దినోత్సవంలో పాల్గొన్న పలు దళాల అధికారులు, సిబ్బంది

విశాఖ సిటీ: సీఆర్‌పీఎఫ్‌లో అగ్నివీర్ల నియామకానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు సీఆర్‌పీఎఫ్ డీజీ అనీష్ దయాల్ సింగ్ తెలిపారు. భీమిలి నేవల్ స్టేషన్‌లో నేవల్ సివిలియన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఆర్ పాలసీలపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన డీజీ మాట్లాడుతూ అగ్నివీర్‌లకు పది శాతం రిజర్వేషన్, వయస్సు మినహాయింపుతో పాటు శారీరక సామర్థ్య పరీక్ష ఉండదని స్పష్టం చేశారు. సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బీ) డీజీ దల్జీత్ సింగ్ చౌదరి, ఆర్‌పీఎఫ్ డీజీ మనోజ్ యాదవ మాట్లాడుతూ ఎస్ఎస్‌బీ, ఆర్‌పీఎఫ్‌లలో కూడా అగ్నివీర్లకు ప్రత్యేక రిజర్వేషన్ ఉందని చెప్పారు. అన్ని దళాలకు అగ్నివీర్ల సేవలు దోహదం చేస్తాయన్నారు.

ఫీడర్ల లోపాలపై ప్రత్యేక సర్వే

- లోపాలు గుర్తించి నిరంతరాయ విద్యుత్‌కు ప్రత్యేక కార్యాచరణ
- ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి



సాక్షి, విశాఖపట్నం : ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఏలూరు సర్కిళ్ల పరిధిలో సుమారు 500 ఫీడర్లలో ప్రత్యేక సర్వే నిర్వహించామని ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. సర్వేలో గుర్తించిన లోపాలను పీఎంఐ సర్వే యాప్‌లో నమోదుచేసి వాటిని సరిచేసి అంతరాయాలను తగ్గిస్తున్నామని పేర్కొన్నారు. వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయాలు లేకుండా, నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని వెల్లడించారు. ఆయా సర్కిళ్ల ఎస్ఈలు, ఈఈలు, డీఈఈలతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి.. విద్యుత్ అంతరాయాల నివారణకు చేపట్టాల్సిన చర్యలకు సంబంధించి సూచనలిచ్చారు. జిల్లాల వారీగా తరచూ ఏర్పడుతున్న అంతరాయాలను గుర్తించేందుకు 33 కెవి ఫీడర్స్, 11 కేవీ ఫీడర్స్‌ని ఎంపిక చేసుకొని వాటిని సర్వే చేసి లోపాలను పీఎంఐ సర్వే మొబైల్ యాప్‌లో నమోదు చేస్తున్నట్లు వివరించారు. విద్యుత్ సంబంధిత సమస్యలను టోల్ ఫ్రీ నంబర్ 1912 కు తెలియచేస్తే సకాలంలో పరిష్కరిస్తామని తెలిపారు.

కేంద్ర మంత్రికి వినతుల వెల్లువ

ఉక్కునగరం: కేంద్ర ఉక్కుమంత్రి హెచ్‌డీ కుమారస్వామికి వివిధ సంఘాల నాయకులు తమ సమస్యలను వినతిపత్రాల ద్వారా అందజేశారు. ప్రైవేటీకరణ జరిగితే నిర్వాసితులు నష్టపోతారని, వారికి ఉపాధి కల్పించాలని, వయసు పైబడిన వారికి శాశ్వత ఉపాధి కల్పించాలని స్టీల్ డీవీఆర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.వి.రమణారెడ్డి వినతిపత్రం అందజేశారు. ప్లాంట్ కోసం భూములు కోల్పోయిన 8500 మందికి ఉపాధి కల్పించాలని ఉక్కు శ్రామిక సంఘం ప్రధాన కార్యదర్శి బొడ్డు పైడిరాజు కోరారు.

జీవీఎంసీ కమిషనర్‌గా హరేందిర ప్రసాద్ బాధ్యతలు

మహారాణిపేట (విశాఖ): జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ జీవీఎంసీ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు చేపట్టారు. బుధవారం సాయంత్రం తన కార్యాలయంలో సంబంధిత పత్రాలపై సంతకం చేసి అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. పలువురు జిల్లా స్థాయి అధికారులు, జీవీఎంసీ అధికారులు హరేందిర ప్రసాద్‌కు అభినందనలు తెలిపారు. జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ ఏపీ టౌన్‌షిప్ ఇన్‌ఫ్రాస్ట్రక్టర్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బదిలీ అయిన సంగతి విదితమే.

తల్లికి వందనం ఒక్క బిడ్డకేనా?

'నీకు రూ.15 వేలు.. నీకు రూ.15 వేలు.. ఇగో నీకు రూ.15 వేలు'
ఎన్నికల సమయంలో బాగా వైరల్ అయిన ఓ వీడియో చూసే ఉంటారు. ప్రస్తుత రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఓ ఇంటి దగ్గరకు వెళ్లి.. ఆ ఇంట్లో పిల్లలను చూపిస్తూ అందరికీ డబ్బులు వస్తాయని లెక్కలతో సహా చెప్పారు.

పిల్లలను బడికి పంపే తల్లుల విషయంలో జగన్ ప్రభుత్వం మోసం చేస్తోందని.. తాము అధికారంలోకి వస్తే ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం వర్తింపజేస్తామని చంద్రబాబు ఎన్నికల సమయంలో ప్రచారం చేశారు.
కూటమి అభ్యర్థులు కూడా ఇదే విషయాన్ని పదే పదే ప్రస్తావించారు.

కట్ చేస్తే..
పిల్లలను స్కూల్‌కు పంపే అమ్మలకు 'తల్లికి వందనం' పథకం కింద రూ.15 వేలు ఆర్థిక సాయం అంటూ జీవో 29 పేరిట ఉత్తర్వులు జారీ చేసింది. అంటే ఒక ఇంట్లో.. ఒక్కరికే రూ.15 వేలు ఇస్తామని చెప్పకనే చెప్పింది. ఈ పథకం కోసం ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్న తల్లుల్లో ఈ జీవోతో గందరగోళం నెలకొనగా.. రానున్న రోజుల్లో ఈ పథకంలో కోత పెట్టే మాయేనని అంతటా చర్చ నడుస్తోంది.





ఈ తల్లులకు భారం తగ్గేనా..



విద్యార్థుల్లోని నాటి ఆనందం వెల్లివిరిసేనా..

- తల్లికి వందనం.. అంతా గందరగోళం
- ఎంతమందైనా రూ.15 వేలు చొప్పున ఇస్తామన్న కూటమి ప్రభుత్వం
- తాజా ఉత్తర్వులతో పథకం అమలుపై సందేహాలు
- ఆధార్ అనుసంధానం పేరిట లబ్ధిదారుల ఏరివేతకు కుట్ర
- ఫీజులు కట్టాలని ప్రైవేట్ పాఠశాలల్లో ఒత్తిళ్లు
- తల్లికి వందనం సాయం కోసం ఎదురుచూపు

సాక్షి, అనకాపల్లి: పేద విద్యార్థుల చదువులు సవ్యంగా ముందుకు సాగే పరిస్థితులు కనిపించడం లేదు. 'తల్లికి వందనం' పథకం కింద ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివే విద్యార్థులకు రూ.15 వేలు చొప్పున ఇచ్చేందుకని ప్రభుత్వం తాజాగా జారీ చేసిన జీవో పలు అనుమానాలకు తావిస్తోంది. తల్లికి వందనం, అదే విధంగా స్టూడెంట్ కిట్ పంపిణీ చేసే విద్యార్థులకు సంబంధించిన సమగ్ర వివరాలు సేకరణకు ప్రభుత్వం సిద్ధం కావడమే ఈ అనుమానాలకు బలం చేకూరిస్తోంది. ఆధార్ అనుసంధానంతో ప్రతీ విద్యార్థి బయోమెట్రిక్ అథంటికేషన్ ధ్రువీకరించాలని ప్రభుత్వం తాజాగా స్పష్టం చేసింది. ఎన్నికల్లో కూటమికి ఓటు వేయని వారిని గుర్తించి, అలాంటి లబ్ధిదారులైన విద్యార్థుల పేర్లను జాబితాలోంచి తొలగించాలనే కుట్రల్లో భాగమే ఈ చర్యలని తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలైంది.

డబ్బులు మంజూరయ్యేదెప్పుడో?
వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాలుగేళ్ల పాటు అమ్మ ఒడి పథకం కింద మొత్తం రూ.726.80 కోట్లు మంజూరు చేశారు. జిల్లాలో మొత్తం 6.32 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం అందింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే అధికారంలో ఉండి ఉంటే.. జూన్ నెలలోనే విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేవి. అయితే కూటమి ప్రభుత్వం రావడంతో సీన్ రివర్స్ అయింది. తాజాగా పథకం అమల్లో మడతపేచీ పెడుతుండటం అనేక అనుమానాలకు తావిస్తోంది.

ఫీజుల కోసం ప్రైవేటు పాఠశాలల ఒత్తిడి
బడికి వెళ్లే వారు ఎంత మంది ఉన్నా.. అందరికీ ఏడాదికి రూ.15 వేలు ఇస్తామన్న కూటమి ప్రభుత్వ ఎన్నికల హామీతో జిల్లాలోని చాలా మంది ప్రభుత్వ స్కూళ్ల నుంచి ప్రైవేట్ స్కూళ్లలో చేరారు. అందరికీ తల్లికి వందనం డబ్బులు వచ్చే అవకాశం ఉందని, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు సైతం ఇందుకు ప్రోత్సహించాయి. కానీ.. తల్లికి వందనం డబ్బులు ఇప్పట్లో వచ్చే పరిస్థితులు కనిపించకపోవడంతో తమ స్కూళ్ల నిర్వహణ కష్టమని భావించిన ప్రైవేట్ యాజమాన్యాలు ఫీజుల కోసం విద్యార్థులపై ఒత్తిడి పెంచాయి. దీంతో తల్లిదండ్రులు తర్జనభర్జన పడుతున్నారు.

ఇంకా అందని యూనిఫాంలు
వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో బడులు తెరిచిన తొలిరోజునే ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో చదివే విద్యార్థులందరికీ తొమ్మిది రకాల వస్తువులతో కూడిన విద్యాకానుక అందించారు. దీనికి కొనసాగింపుగా 2024–25 విద్యా సంవత్సరానికి ఎన్నికల ముందే అన్ని రకాల వనరులు సమకూర్చారు.
ఈ లోగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వీటి పంపిణీ సవ్యంగా జరగలేదు. విద్యా కానుకలను 'స్టూడెంట్ కిట్'గా పేరు మార్చినా.. వాటిని పూర్తి స్థాయిలో అందించే విషయంలో ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదు. విద్యార్థులకు యూనిఫాంలు, షూలు ఇంకా ఇవ్వలేదు.

తల్లికి వందనం డబ్బుల కోసం చూస్తున్నా..



నాకు ఇద్దరు పాపలు, ఒక బాబు ఉన్నారు. పాములవాకలోని జెడ్పీ హైస్కూల్‌లో పెదపాప 9వ తరగతి, చిన పాప 7వ తరగతి చదువుతున్నారు. బాబు నర్సీపట్నంలోని ప్రైవేటు స్కూల్‌లో 2వ తరగతి చదువుతున్నాడు. ముగ్గురు పిల్లలకు చదువు భారంగా ఉంది. సీఎం చంద్రబాబు నాయుడు ప్రభుత్వం వస్తే తల్లికి వందనం పథకం ద్వారా పిల్లలందరికీ రూ.15 వేల చొప్పున వేస్తానన్నారు. ఆ విధంగా నాకు రూ.45 వేలు వస్తాయి. స్కూల్స్ తెరిచి నెల రోజులు దాటిపోతోంది. ఇంకా డబ్బులు పడలేదు. పిల్లల ఫీజులు కట్టడానికి రూ.45 వేలు ఎప్పుడు వేస్తారని ఎదురు చూస్తున్నా..

– కన్నంరెడ్డి నాగలక్ష్మి, నీలిగుంట, కోటవురట్ల మండలం

నా ముగ్గురు పిల్లలకు డబ్బులు అందించాలి



నాకు ముగ్గురు పిల్లలు. కుమారుడు వర ప్రసాద్ దిబ్బిడి హైస్కూల్‌లో 9వ తరగతి, పెద్ద పాప తేజశ్రీ 5వ తరగతి, రెండో పాప లాస్య 2వ తరగతి మా గ్రామ పాఠశాలలో చదువుతున్నారు. ఎన్నికల ముందు కుటుంబంలో ఎంత మంది పిల్లలుంటే అంతమందికి ఏడాదికి తల్లికి వందనం పథకం కింద రూ.15 వేలు ఇస్తామంటే చంద్రబాబు నాయుడికి ఓటు వేశాం. ఇప్పుడు ఇంట్లో ఒక్కరికే ఇస్తామంటే ఎలా? నా ముగ్గురి పిల్లలకు తల్లికి వందనం కింద ఏడాదికి రూ.45 వేలు అందించాలి. ఎన్నికల ముందు చెప్పిన వాగ్దానాన్ని ముఖ్యమంత్రి అమలు చేయాలి.

– బోడి మాధవి, నేతవానిపాలెం, బుచ్చెయ్యపేట మండలం

పాఠశాల యాజమాన్యం ఫీజు అడుగుతోంది



మా బాబు, పాపను కె.కోటపాడులో ప్రైవేటు స్కూలులో చదివిస్తున్నాం. గత ప్రభుత్వంలో అమ్మఒడి కింద ఏటా జూన్ నెలాఖరులోగా నా బ్యాంక్ ఖాతాలో నగదు జమ అయ్యేది. చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం తల్లికి వందనం పేరున ఇద్దరు పిల్లలకు రూ.15 వేల చొప్పున రూ.30 వేలు ఇవ్వాలి. పాఠశాలలు తెరుచుకుని రెండు నెలలు కావస్తోంది. మా పిల్లలు చదువుతున్న పాఠశాల యాజమాన్యం మొదటి విడత ఫీజులు చెల్లించాలని ఒత్తిడి చేస్తోంది. తల్లికి వందనం నగదు కోసం ఎదురు చూస్తున్నాం.

– గొర్రుపోటు సౌజన్య, వారాడ గ్రామం, కె.కోటపాడు మండలం

ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు పరచాలి



నాకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. పెద్ద కుమార్తె వైష్ణవి (7వ తరగతి,) రెండో కుమార్తె నిహారిక (నాల్గో తరగతి), బాబు ప్రైవేటు స్కూలులో ఎల్.కె.జి చదువుతున్నారు. గత ప్రభుత్వంలో తల్లుల ఖాతాల్లో అమ్మఒడి పథకం నగదు జమ చేసేవారు. ఆ సాయంతో మా పిల్లల చదువుకు ఎంతగానో ఉపయోగపడింది. చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ నెరవేర్చాలి. ఇంట్లో ఎంతమంది చదువుకున్నా తల్లికి వందనం వర్తింపజేసి ఒక్కొక్కరికి రూ.15 వేలు ఇవ్వాలి.

– బంటు లక్ష్మి, కొండపాలెం గ్రామం, రోలుగుంట మండలం

మాట మీద నిలబడాలి



నాకు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో తల్లికి వందనం పథకంలో ఇద్దరికి రూ.15 వేల చొప్పున ఇవ్వాలి. మొత్తం నాకు రూ.30 వేల వరకు వస్తాయి. ఇంత వరకు జమ కాకపోవడం వల్ల స్కూలు ఫీజులకు ఇబ్బందులు పడుతున్నాం. ముఖ్యమంత్రి మాట మీద నిలబడాలి.

– బొట్టా లోవలక్ష్మి, గొలగొండ గ్రామం, మండలం

టీడీపీ మేనిఫెస్టోలో చెప్పడంతో ఎదురు చూస్తున్నాం



ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం పథకం కింద ఏటా రూ. 15 వేల చొప్పున ఇస్తామని టీడీపీ మేనిఫెస్టోలో చెప్పడంతో ఎదురు చూస్తున్నాం. మాకు పిల్లలు నందకిశోర్ 8వ తరగతి, రేవంత్–7వ తరగతి ప్రైవేటు స్కూల్‌లో చదువుతున్నారు. ఇప్పటికే స్కూల్స్ ప్రారంభించి నెల రోజులు దాటి పోవడంతో స్కూల్ యాజమాన్యం ఫీజులు కోసం ఒత్తిడి చేస్తోంది. ప్రభుత్వ సహాయం కోసం వేచి చూస్తున్నాం. ఫీజుతో పాటు నోట్ పుస్తకాలు, యూనిఫాంలు సైతం కొనుగోలు చేయాల్సి ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం తక్షణమే పథకం వర్తింప చేసి తల్లుల ఖాతాలో నగదు జమ చేయాలి.

– కాటిపాం సంతోషి కుమారి, తెనుగుపూడి, దేవరాపల్లి మండలం

విద్యార్థినులకు అస్వస్థత



చోడవరం ఆస్పత్రిలో విద్యార్థినులకు అందిస్తున్న వైద్య సేవలు



వడ్డాది ఆస్పత్రిలో వైద్య సేవలను పరిశీలిస్తున్న ఎంఈవో కాశీ విశ్వేశ్వరరావు

- అకస్మాత్తుగా కళ్లు తిరిగిపడిపోయిన ఆరుగురు బాలికలు
- ఆస్పత్రిలో వైద్యసేవల అనంతరం డిశ్చార్జి

బుచ్చెయ్యపేట: మండలంలోని వడ్డాది కోవెల అప్పనదొర జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఆరుగురు పదో తరగతి విద్యార్థినులు అకస్మాత్తుగా అస్వస్థతకు గురయ్యారు. గురువారం పాఠశాలకు వచ్చిన వారు మధ్యాహ్న భోజనం చేయడానికి ముందే ఈ ఘటన జరిగింది. ముందుగా తరగతి గదిలో విద్యార్థిని పి.వేదదివ్య కళ్లు తిరిగి పడిపోగా తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు సపర్యలు చేశారు. వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తరవాత వీర్ల అశ్విని అస్వస్థతకు గురవగా ఆమెకు సపర్యలు చేస్తుండగా, వి.లోహితలక్ష్మి, కె.సునీత, చల్లా ధరణి, బి.సుస్మిత కళ్లు తిరిగి పడిపోయారు. వీరిని ముందుగా వడ్డాది ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అక్కడ వైద్యురాలు మౌనిక వైద్య సేవలందించారు. తర్వాత చోడవరం ఆస్పత్రికి విద్యార్థులను తరలించారు. అక్కడ మెరుగైన వైద్య సేవలందించారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం లేకపోవడంతో సాయంత్రం ఇళ్లకు పంపించారు. పదో తరగతిలో మొత్తం 158 మంది విద్యార్థులు చదువుతుండగా, సి. సెక్షన్‌లో 56 మంది ఉన్నారు. వీరిలో ఆరుగురు విద్యార్థినులు స్పృహ తప్పి పడిపోవడంపై ఉపాధ్యాయులు విస్మయానికి గురయ్యారు. ధరణికి మూడు రోజుల నుంచి, అశ్వినికి రెండు రోజులుగా బాగోలేదని తెలిపారు. తమ పిల్లలు అస్వస్థతకు గురయ్యారని తెలుసుకున్న వారి తల్లిదండ్రులు కంగారు పడి పాఠశాలకు, ఆస్పత్రికి వెళ్లారు. పిల్లలకు బాగోలేదని వెంటనే సమాచారం అందించకపోవడంపై హెచ్ఎం శేషుబాబు, ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఈవో కాశీ విశ్వేశ్వరరావు విద్యార్థినులను పరామర్శించారు. తరగతి గదిని పరిశీలించారు. ఆక్సిజన్ సరిగా అందకపోవడం వల్ల అస్వస్థతకు గురయ్యారా అని ఉపాధ్యాయుల్ని అడిగి తెలుసుకున్నారు. సి. సెక్షన్ విద్యార్థుల తరగతి గదిని వేరే రూంకు మార్చాలని సూచించారు.

ఇది ప్రేమంటారా?

- బాలికను హతమార్చి ఆత్మహత్య చేసుకున్న కిరాతకుడు
- మృతురాలి ఇంటికి సమీపంలోనే యువకుడి మృతదేహం లభ్యం
- కక్ష కార్పణ్యాలకు రెండు ప్రాణాలు బలి



పురుగుల మందు కలిపిన కూల్ డ్రింక్ సీసాను పరిశీలిస్తున్న క్లూస్ టీం



దర్శిని, నిందితుడు సురేశ్ (ఫైల్)

రాంబిల్లి (అచ్యుతాపురం): ప్రేమ త్యాగానికి ప్రతిరూపం. తనకంటే తాను ప్రేమించిన వ్యక్తి బాగుండాలనుకుంటే అది నిజమైన ప్రేమ. తనకు దక్కని వ్యక్తి ఈ లోకంలోనే ఉండకూడదనుకుంటే అది పైశాచికత్వం. అలాంటి ప్రేమోన్మాదం రెండు నిండు ప్రాణాలను బలిగొంది. అభం శుభం తెలీని ఓ బాలిక నేలరాలింది. సొంత ఊరిలో వెంటబడుతున్నాడని అమ్మమ్మ గారి ఇంట్లో తల దాచుకున్నా ఫలితం లేకపోయింది. రాంబిల్లి మండలం కొప్పుగొండుపాలెంలో బద్ది దర్శిని (14) అనే బాలికను ఈనెల 6వ తేదీ రాత్రి కశింకోట మండలానికి చెందిన సురేశ్ గొంతు కోసి ప్రాణాలు తీసిన విషయం తెలిసిందే. ప్రేమిస్తున్నానంటూ వెంట పడుతున్న అతనిపై కశింకోట మండలానికి చెందిన దర్శిని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోక్సో కేసు పెట్టి అరెస్టు చేశారు. బాలికను రాంబిల్లి మండలంలో అమ్మమ్మ గారి ఇంట్లో ఉంచి చదివిస్తున్నారు. బెయిల్‌పై వచ్చిన సురేశ్ జైలుకు పంపిందన్న కక్షతో దర్శినిని హతమార్చాడు. సంఘటన స్థలంలో వదిలి వెళ్లిన లేఖలో 'ఇద్దరం కలిసి ఉండాలి.. లేదా ఇద్దరం చనిపోవాలి' అని పేర్కొన్నాడు. అందులో రాసినట్టే పురుగు మందు తాగి ప్రాణాలు తీసుకున్నాడు. అతని మృతదేహం బాలిక అమ్మమ్మ గారింటికి సమీపంలోనే రెండు వందల మీటర్ల దూరంలోని కొండ వంటి ప్రాంతంలో గడ్డి దుబ్బుల మాటున గురువారం కనిపించింది.

పోలీసుల ప్రయత్నం వృథా
ఈ ఘటనలో పోలీసుల తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. నిందితుడు బెయిల్‌పై బయటకు వచ్చాడన్న విషయం వెల్లడించి పోలీసులు బాలిక కుటుంబీకుల్ని అప్రమత్తం చేస్తే ఇటువంటి దురాగతం జరిగి ఉండేది కాదన్న అభిప్రాయం వ్యక్తమైంది. నిందితుడు మళ్లీ బాలిక వెంట పడుతున్నట్టు ఆమె కుటుంబ సభ్యులు రెండు, మూడు రోజుల క్రితం రాంబిల్లి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారని, వారు పట్టించుకోలేదన్న ఆరోపణలు వినిపించాయి. ఈ విమర్శల విషయంలో పోలీసులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని హోం మంత్రి అనితను విలేకరులు సంఘటన జరిగిన మర్నాడు అనకాపల్లిలో ప్రశ్నించారు. అలాంటిది జరిగినట్టు తన దృష్టికి రాలేదని, అదే నిజమైతే సంబంధిత పోలీస్ సిబ్బందిపై చర్యలు చేపడతామని ఆరోజు ఆమె చెప్పారు. చివరకు రాంబిల్లి ఎస్ఐ ముకుందరావును బుధవారం వీఆర్‌పై పంపించారు. ఈ హత్యకు సంబంధించి పోలీస్ యంత్రాంగంపై ఒత్తిడి పెరగడంతో 12 బృందాలను ఏర్పాటు చేసి నిందితుని కోసం గాలించారు. చివరకు ఘటనా స్థలానికి సమీపంలో దుర్వాసన వచ్చి, మృతదేహం దొరికితే గానీ గానీ నిందితుడి ఆచూకీ బయటపడలేదు. పరవాడ డీఎస్పీ సత్యనారాయణ, సీఐ నర్సింగరావు నేతృత్వంలోని బృందం శవాన్ని పరిశీలించి లభించిన ఆధారం మేరకు సురేశ్‌గా నిర్ధారించారు. మృతుడి జేబులో కొంత నగదు, తాను రాసిన లేఖ జెరాక్స్ కాపీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని తరలిస్తున్న సమయంలో ఆ వాహనాన్ని దర్శిని కుటుంబీకులు అడ్డుకొని తన కుమార్తెకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు సర్ది చెప్పి వాహనాన్ని పంపించారు. పోస్టుమార్టం నిర్వహించిన వైద్యులు అంత్యక్రియల నిమిత్తం సురేశ్ మృతదేహాన్ని కశింకోటకు తరలించారు.

సీఎం దృష్టికి స్థానిక సమస్యలు



దార్లపూడిలో స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న సీఎం చంద్రబాబు

ఎస్.రాయవరం: దార్లపూడి గ్రామం శివారులో గురువారం పోలవరం ఎడమ కాలువ పనులు పరిశీలించేందుకు వచ్చిన సీఎం చంద్రబాబునాయుడుకు స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, హోం మంత్రి వంగలపూడి అనిత, యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ తదితరులు స్వాగతం పలికారు. దార్లపూడి ఉన్నత పాఠశాల మైదానంలో హెలికాప్టర్ దిగి సుమారు కిలోమీటరు దూరంలో ఉన్న కాలువ నిర్మాణం వద్దకు వెళ్లి పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు వివిధ సమస్యలపై వినతులు అందజేశారు. యలమంచిలిలో శిథిలావస్థకు చేరుకున్న యలమంచిలి కోర్టు భవన నిర్మాణం చేపట్టాలని పలువురు లాయర్లు సీఎంకు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ విజయ కృష్ణన్ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వామనావతారంలో జగన్నాథస్వామి



అనకాపల్లి: జగన్నాథ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు గురువారం స్వామి వామనావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక గూడ్స్ రోడ్డులోని ఇంద్రద్యుమ్న హాల్లో కొలువైన సుభద్ర బలభద్ర సమేత జగన్నాథస్వామిని భక్తులు దర్శించుకున్నారు.

గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై పర్యవేక్షణ

- ఆర్లి విలేజ్ హెల్త్ క్లినిక్‌లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీ



విలేజ్ హెల్త్ క్లినిక్‌లో రికార్డులను పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారి లూసీ కార్డిలియా

కె.కోటపాడు: గర్భిణులు, బాలింతల ఆరోగ్యాన్ని వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడూ పర్యవేక్షించాలని అనకాపల్లి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ టాస్క్‌ఫోర్స్ అధికారి లూసీ కార్డిలియా తెలిపారు. మండలంలోని ఆర్లిలో విలేజ్ హెల్త్ క్లినిక్‌ను బృంద సభ్యులతో కలిసి గురువారం ఆమె పరిశీలించారు. ఇక్కడ వైద్య సేవలతోపాటు హెచ్‌బీ శాతం నమోదుపై వైద్య సిబ్బందిని ఆరా తీశారు. ప్రస్తుత అపిడమిక్ సీజన్‌లో డయేరియా, డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాలు నిర్వహిస్తున్నారా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్య సిబ్బందితో మాట్లాడుతూ ప్రతి నెలా గర్భిణులకు హెచ్‌బీ పరీక్ష చేసి రక్తశాతం తక్కువగా ఉంటే, మెరుగైన వైద్యం కోసం సీహెచ్‌సీలకు రిఫర్ చేయాలన్నారు. స్కూల్ హెల్త్ ప్రోగ్రాంలో భాగంగా విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీపీహెచ్ఎన్‌వో నాగమణి, గణాంక అధికారి జనార్దన్, చౌడువాడ పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ డీఎస్ఎన్ రాజు, డేటా మేనేజర్ దినేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో సాంకేతిక లోపం..

- గంట ఆలస్యంగా బయల్దేరిన మరో స్పెషల్ రైలు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం–సికింద్రాబాద్ (20833) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఒక కోచ్‌లో గురువారం సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో ఈ రైలును రద్దుచేసి ప్రయాణికుల సౌకర్యార్థం మరో ప్రత్యేక రైలు 14–థర్డ్ ఏసీ ఎకానమి కోచ్‌లతో విశాఖపట్నం నుంచి వందే భారత్ మార్గంలో అదే హాల్ట్‌లతో నడిచేవిధంగా బయల్దేరింది. ఈ ప్రత్యేక రైలు ఉదయం 6.45 గంటలకు (గంట ఆలస్యంగా) విశాఖపట్నంలో బయల్దేరింది. సమస్యను గుర్తించిన వెంటనే అధికారులు స్పందించి డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరబ్‌ప్రసాద్ ఆదేశాలతో వేరే ప్రత్యేక రైలు ఏర్పాటుచేశారు. రైలు ప్రయాణికులకు కేటరింగ్ సిబ్బంది అందుబాటులో ఉంచారు.

నేడు హైకోర్టు జడ్జి రాక

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మధరావు శుక్రవారం విశాఖ వస్తున్నారు. వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో రాత్రి 11.31 గంటలకు విశాఖ రైల్వే స్టేషన్‌లో దిగి నేరుగా ప్రభుత్వ అతిథి గృహానికి చేరుకొని రాత్రికి అక్కడ బస చేస్తారు. 13న సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. 14న సాయంత్రం 6.55 గంటలకు ఇండిగో విమానంలో విజయవాడ వెళ్తారు.

నేటి వరకే ఇంజినీరింగ్ వెబ్ ఆప్షన్ల గడువు

మురళీనగర్ : ఇంజినీరింగ్ కాలేజీల్లో ప్రవేశాలకు సంబంధించి వెబ్ ఆప్షన్ల గడువు శుక్రవారంతో ముగుస్తుంది. దీంతో గురువారం కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లోని హెల్ప్‌లైన్ కేంద్రానికి అత్యధిక సంఖ్యలో విద్యార్థులు ఇచ్చి వెబ్ ఆప్షన్లు పెట్టుకున్నారు. శనివారం ఆప్షన్లు మార్చుకోవడానికి అవకాశం ఉంది. ఈనెల 16న సీట్లు కేటాయిస్తారు. 17 నుంచి 22 తేదీ వరకు సెల్ఫ్ జాయినింగ్ రిపోర్టు ఆన్‌లైన్‌లో చేసి కాలేజీలకు ఆ రిపోర్టు సమర్పించాలి. 19 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

ఆఖరి దశ పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం
పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశాలకు సంబంధించి పాలిసెట్ ఆఖరి విడత కౌన్సెలింగ్ కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో గురువారం ప్రారంభమైంది. ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ చేసుకోలేనివారు తమ సర్టిఫికెట్లను పరిశీలన చేయించుకుని వెబ్ ఆప్షన్లు పెట్టుకున్నారు. వీరు 13వ తేదీ వరకు వెబ్ ఆప్షన్‌లు పెట్టుకోవచ్చు. 14న ఆప్షన్ల మార్పిడి, 16న సీట్ల కేటాయింపు ఉంటుంది. 18 నుంచి 20వ తేదీ వరకు సెల్ఫ్ జాయినింగు రిపోర్టు చేయాల్సి ఉంటుంది.

జీవీఎంసీ కార్యక్రమాల అమలుపై సంతృప్తి



సమీక్షిస్తున్న 5వ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ మెంబర్ సెక్రటరీ రమణారెడ్డి, సభ్యులు ప్రసాదరావు, పద్మారావు

- సమీక్ష నిర్వహించిన స్టేట్ ఫైనాన్స్ కమిషన్

మహారాణిపేట (విశాఖ): మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలపై ఆంధ్రప్రదేశ్ 5వ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సమీక్ష చేపట్టింది. జిల్లా పరిషత్ సమావేశం మందిరంలో గురువారం కమిషన్ మెంబర్ సెక్రటరీ కె.వి.రమణారెడ్డి, కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ ఎం.ప్రసాదరావు, ఎం.వి.ఎస్.పద్మారావు, కె.కృపారావు సమీక్ష నిర్వహించగా.. జీవీఎంసీ డీసీఆర్ శ్రీనివాసరావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు. జీవీఎంసీ రెవెన్యూ, స్మార్ట్ సిటీ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం, పట్టణ ప్రణాళిక, తాగునీరు మొదలైన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా డీసీఆర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ జీవీఎంసీ రెవెన్యూ పెంచడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఐదేళ్లలో జీవీఎంసీ వృద్ధిరేటు, ఇళ్లు, ఖాళీ స్థలాల పన్నులు, వాణిజ్య సముదాయాల అద్దెలు, తాగునీటి పన్నులు మొదలైన అంశాలపై వివరణ ఇచ్చారు. ఇక్కడ భూ ఆధారంగా మార్కెట్ రేట్లు అధికంగా ఉన్నాయని, ఇందుకు అనుగుణంగా వాణిజ్య సముదాయాల అద్దెలు నిర్ణయిస్తున్నట్టు తెలిపారు. దీంతో కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావడం లేదని, వాణిజ్య సముదాయాల అద్దెలు తగ్గించేలా ప్రభుత్వానికి నివేదించాలని విజ్ఞప్తి చేశారు. స్మార్ట్ సిటీ విభాగంలో విశాఖ నగరం 8వ ర్యాంకు సాధించిందని, రూ.1000 కోట్లతో స్మార్ట్ సిటీ ప్రాజెక్టులు చేపట్టినట్టు డీసీఆర్ తెలిపారు. ఇప్పటివరకు రూ.649 కోట్లతో 57 ప్రాజెక్టులను పూర్తి చేశామన్నారు. మరో నాలుగు ప్రాజెక్టులు దాదాపు పూర్తయ్యాయన్నారు. సోలార్ ప్లాంట్ ద్వారా ఐదు మెగావాట్ల విద్యుత్ ఆదా అవుతోందన్నారు. 25 ఎకరాల్లో కాపులుప్పాడ డంపింగ్ యార్డ్ వద్ద జిందాల్‌తో వేస్ట్ టు ఎనర్జీ ప్రాజెక్ట్ ఏర్పాటు చేసి రోజుకు 1000 టన్నుల వ్యర్థాల నుంచి పది మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నట్లు వివరించారు. 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా నగరంలో కాలుష్యాన్ని తగ్గించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జీవీఎంసీ ఆదాయం, జమలు, వ్యయాలపై ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి కమిషన్ సభ్యులకు వివరించారు. జీవీఎంసీ చేపడుతున్న కార్యక్రమాలపై కమిటీ సభ్యులు సంతృప్తి వ్యక్తం చేస్తూ లోటుపాట్లపై ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. జీవీఎంసీ ఫైనాన్స్ అడ్వైజర్ మల్లికాంబ, కార్య నిర్వాహక ఇంజనీర్ సుబ్బారావు, డీసీపీ రామకృష్ణారెడ్డి, స్మార్ట్ సిటీ మేనేజర్ ఆనంద్, ఎస్ఆర్‌యూ టీం కోఆర్డినేటర్ శ్రీనివాస్ రాజమణి పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీకి గురుకుల విద్యార్థుల ఎంపిక



పైలా మౌళి, విద్యార్థి, ట్రిపుల్ ఐటీ శ్రీకాకుళం



ఇంద్ర ఆకాష్, విద్యార్థి, ట్రిపుల్ ఐటీ ఒంగోలు

అనకాపల్లి : స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి రహదారిలో గల మహాత్మ జ్యోతిబాపూలే ఏపీ బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు పైల మౌళి, ఇంద్ర ఆకాష్‌లు ప్రతిష్టాత్మకమైన ఐఐఐటీలో స్థానం సంపాదించారు. పైల మౌళికి శ్రీకాకుళం క్యాంపస్‌లో, ఇంద్ర ఆకాష్ ఒంగోలు క్యాంపస్‌లో ప్రవేశానికి అర్హత సాధించినందుకు పాఠశాల ప్రిన్సిపాల్ దేవరశెట్టి వెంకటేశ్వర్లు, పాఠశాల తల్లిదండ్రులు కమిటీ చైర్మన్ కర్రి గంగాధర్‌లు గురువారం అభినందించారు. ఈ ఏడాది పదో తరగతి ఫలితాలలో పాఠశాల ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించినట్టు చెప్పారు. ప్రతి సంవత్సరం తమ పాఠశాల విద్యార్థులు ట్రిబుల్ ఐటీకి ఎంపిక అవడం గర్వించదగిన విషయమని అన్నారు. హిందీ అధ్యాపకుడు మహేంద్రనాథ్ పట్నాయక్ మాట్లాడుతూ ప్రతిభ కలిగిన విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంచి అవకాశాలు కల్పిస్తున్నాయని అన్నారు.

ఆధార్ సర్వర్ డౌన్

- నిలిచిన రిజిస్ట్రేషన్లు
- తిరిగి సాయంత్రం ప్రారంభమైన సేవలు

విశాఖ సిటీ: దేశవ్యాప్తంగా ఆధార్ సేవలు నిలిచిపోవడంతో జిల్లాలో దాని అనుసంధానమైన ప్రభుత్వ సేవలన్నీ గురువారం స్తంభించిపోయాయి. ఆధార్‌కు సంబంధించిన విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ(యూఐడీఏఐ) సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో ఆధార్ సంబంధిత ఓటీపీలు, ఇతర తరహా సేవల్లో అంతరాయం ఏర్పడింది. దీని ప్రభావం ప్రధానంగా బ్యాంకులు, రిజిస్ట్రేషన్లు వంటి సేవలపై పడింది. ఆయా శాఖల్లో ఆధార్ అనుసంధానిత సేవలకు సంబంధించిన ఓటీపీలు రాకపోవడంతో సేవలు నిలిచిపోయాయి. ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ సమస్య తలెత్తింది.

దీంతో గురువారం రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సేవలు పూర్తిగా ఆగిపోయాయి. ఆస్తుల క్రయ, విక్రయాల రిజిస్ట్రేషన్లకు ఆటంకం ఏర్పడింది. మధ్యాహ్నం పది నిమిషాల పాటు సర్వర్ పనిచేసి.. మళ్లీ మొరాయించింది. దీంతో ఆస్తుల క్రయ, విక్రయదారులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి వేచి చూసి అనేక మంది వెనుదిరిగారు. చివరకు సాయంత్రం 6 గంటల తరువాత సేవలు తిరిగి అందుబాటులోకి వచ్చినట్లు సమాచారం అందింది. అప్పుడు రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సేవలు పునః ప్రారంభమయ్యాయి. ప్రస్తుతానికి రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఎటువంటి ఇబ్బందులు లేవని అధికారులు చెబుతున్నారు.

త్వరితగతిన హార్బర్‌లో ఆధునికీకరణ పనులు

- మత్స్యశాఖ కార్యదర్శి ఎ.బాబు



హార్బర్‌లో ఆధునికీకరణ పనులను పరిశీలన చేస్తున్న రాష్ట్ర మత్స్యశాఖ కార్యదర్శి బాబు

మహారాణిపేట : ఫిషింగ్ హార్బర్‌లో కేంద్ర ప్రభుత్వ సహకారంతో చేపట్టిన ఆధునికీకరణ పనులు నిర్దేశించిన సమయంలో పూర్తవుతాయని రాష్ట్ర మత్స్యశాఖ కార్యదర్శి ఎ.బాబు తెలిపారు. గురువారం హార్బర్‌లో కేంద్ర ప్రభుత్వం సహకారంతో చేపట్టిన రూ.170 కోట్ల పనులను ఆయన పరిశీలించారు. 2025 డిసెంబర్ నాటికి ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ పనులు పూర్తవుతాయన్నారు. హార్బర్‌లో అన్ని చోట్ల మంచినీరు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హార్బర్‌లో పరిశుభ్ర వాతావరణం ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రధానంగా చేపల వేలం ప్రాంతం తక్షణమే నిర్మాణం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ (మెరైన్) వెంకటేశ్వరరావు, విశాఖ మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ విజయకృష్ణ, ఏడీ విజయ, ఎఫ్‌డీవో ఆశాజ్యోతి, విశాఖ పోర్టు అథారిటీ సెక్రటరీ, విశాఖ పోర్ట్ అథారిటీ చీఫ్ ఇంజనీర్ హరికృష్ణ, సూపరింటెండెంట్ ఇంజనీర్ వికాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అరుణ్, డాల్ఫిన్ బోర్డు అసోసియేషన్ ప్రెసిడెంట్ చింతపల్లి వీర్రాజు, కార్యదర్శి వలిశెట్టి చిన్న, ఉపాధ్యక్షుడు ధోని నాగరాజు, ఏపీ మేకనైజ్డ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు దూడ పోలయ్య, బోట్ యజమానులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించండి: జానకిరామ్
ఏపీ మెకనైజ్డ్ ఫిషింగ్ బోటు ఆపరేటర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ పలు సమస్యలను ప్రభుత్వ సెక్రటరీ బాబు దృష్టికి తీసుకుని వెళ్లారు. అనేక సమస్యలపై బాబుకు వినతిపత్రం అందజేశారు. వీటిలో ప్రధానంగా ప్రభుత్వం నుంచి రావాల్సినటువంటి డీజిల్ సబ్సిడీ బకాయిలను విడుదల చేయాలని, విశాఖకు సంబంధించి రూ.2.78 కోట్లు బకాయిలు ప్రభుత్వం దగ్గర రావాల్సి ఉందని వాటిని విడుదల చేయాలని కోరారు.

అవంతి కళాశాలలకు స్వయంప్రతిపత్తి



అవంతి కుటుంబ సభ్యుల మధ్య కేక్ కట్ చేస్తున్న విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: చెరకుపల్లి(తగరపువలస), మాకవరపాలెం(నర్సీపట్నం) అవంతి ఇంజినీరింగ్ విద్యాసంస్థలకు పదేళ్లకు గానూ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ స్వయంప్రతిపత్తి మంజూరు చేసిందని విద్యాసంస్థల చైర్మన్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. చెరకుపల్లిలో గురువారం జరిగిన అవంతి కుటుంబ సభ్యుల సమావేశంలో ఆయన కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని అన్నివర్గాల విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలన్న ఏకైక లక్ష్యంతో 1999లో విద్యాసంస్థలను స్థాపించినట్టు తెలిపారు. ఈ కళాశాలలు జాతీయస్థాయిలో నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ నుంచి ఎ+ గుర్తింపు పొందాయన్నారు. రాష్ట్రంలో ఉన్నత విద్య అందించడంలో అత్యంత ప్రజాదరణ పొందిన కళాశాలలపై ఇండియాటుడే మ్యాగజైన్ చేసిన సర్వేలో ఉత్తమ కళాశాలలుగా గుర్తించబడ్డాయన్నారు. కళాశాలల్లో అత్యాధునిక ప్రయోగశాలలు, సమగ్ర అభివృద్ధితో వసతులు కల్పించామన్నారు. అవంతి విద్యా సంస్థల నుంచి వేలాది మంది విద్యార్థులు దేశ విదేశాల్లో స్థిరపడ్డారన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ శివనందీష్, ప్రిన్సిపాళ్లు మోహనరావు, మురళీకృష్ణ, డైరెక్టర్ చంద్రశేఖర్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఫోన్లతో క్రియేటివిటీని కోల్పోతున్నాం

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



ఆర్ట్ వర్క్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు

కొమ్మాది: ప్రస్తుత కాలంలో మనం ఏం తెలుసుకోవాలన్నా గూగుల్‌ను అడగాల్సిన పరిస్థితి నెలకొందని.. ఫోన్ల వల్ల మనలో ఉన్న సృజనాత్మకతను కోల్పోతున్నామని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. కాపులుప్పాడలోని శ్రీ ప్రకాష్ విద్యానికేతన్‌లో గురువారం నిర్వహించిన ఆర్ట్ వర్క్ ఎగ్జిబిషన్‌లో మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబుతో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కాలంలో మొబైల్ ఫోన్ల వల్ల ఇంట్లో వారితో కాలం గడిపే అవకాశం లేకుండా పోతోందన్నారు. పూర్వీకులు మనకు అందించిన సంస్కృతి సంప్రదాయాలను నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మన దేశంలో 64 కళలు ఉన్నాయని, వాటిలో ఏదో ఒక రంగంలో విద్యార్థులు రాణించాలని సూచించారు. గవర్నర్ హరిబాబు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పిల్లలు అన్ని కళల్లో రాణించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు వేసిన చిత్రాలు ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు. సింహాచలం దేవస్థానం ఆవశ్యకతను తెలిపే విధంగా చక్కటి బొమ్మలు గీయడం ఆనందించదగిన విషయమన్నారు. పాఠశాల డైరెక్టర్ చిట్టూరి వాసు ప్రకాష్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

14న జిల్లా స్థాయి రోల్‌బాల్ పోటీలు

మురళీనగర్ : విశాఖ రోల్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మురళీనగర్ వైశాఖి స్పోర్ట్సు పార్కులో ఈనెల 14వ తేదీన నాల్గవ జిల్లా స్థాయి రోల్‌బాల్ పోటీలు విశాఖ రోల్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తోట లలితప్రియ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు అండర్–11, 14, 17, 17 ఏళ్లు దాటిన వారికి నాలుగు విభాగాల్లో నిర్వహిస్తామన్నారు. వివరాలకు 9505950425 నంబరులో సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

గంజాయి నిందితుడికి జైలు

చోడవరం : గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితులకు రెండేళ్ల 7 నెలల పాటు జైలు శిక్ష విధిస్తూ చోడవరం తొమ్మిదో అదనపు జిల్లా కోర్టు గురువారం తీర్పు వెలువరించిందని కోటపాడు సీఐ సీహెచ్.స్వామినాయుడు తెలిపారు. ఈ కేసులో తమిళనాడు రాష్ట్రం చెన్నై పట్టణానికి చెందిన నిందితుడు ఆర్.ముకుందహాన్ (42)కు జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు చెప్పిందన్నారు. వివరాలివి. 2021 సంవత్సరం నవంబరు12వ తేదీన చెన్నైకి చెందిన ముకుందహాన్ అనే వ్యక్తి సంచిలిలో 5 కేజీలు గంజాయిని అక్రమ రవాణా చేస్తుండగా వి.మాడుగుల మండలం డి.సురవరం తారురోడ్డు వద్ద మాడుగుల పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి గంజాయితో పాటు రూ.10వేలు నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. దీనిపై చోడవరం తొమ్మిదో అదనపు జిల్లా కోర్టులో వాదనలు జరిగిన అనంతరం నిందితునికి రెండేళ్ల 7 నెలలు జైలు శిక్ష రూ. వెయ్యి జరిమానా విధించినట్టు సీఐ చెప్పారు. జరిమానా కట్టలేని ఎడల అదనంగా మరో నెలరోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ చోడవరం అదనపు జిల్లా జడ్జి కె. రత్నకుమార్ తీర్పు చెప్పినట్టు సీఐ వివరించారు. ఈ సందర్భంగా మాడుగుల పోలీసులను ఆయన అభినందించారు.

పుట్టెడు దుఃఖంలో నేత్రదానం



నేత్రాలు దానం చేసిన శ్రీను (ఫైల్)

పద్మనాభం: తేనెటీగల దాడిలో గాయపడి మృతి చెందిన రెడ్డిపల్లి గ్రామానికి చెందిన పుప్పాల శ్రీను(45) నేత్రాలను గురువారం అతని కుటుంబ సభ్యులు దానం చేశారు. వివరాలివీ.. పద్మనాభం మండలం రెడ్డిపల్లికి చెందిన పుప్పాల శ్రీను ఈ నెల రెండో తేదీన విజయనగరం జిల్లా జామి మండలం అన్నంరాజుపేటలో పెయింటింగ్ పనులకు వెళ్లాడు. అక్కడ పని ముగించుకుని తిరిగి రెడ్డిపల్లి వస్తుండగా మార్గమధ్యలో పాట్నూరు ఏటుకట్టు వద్ద తేనెటీగలు శ్రీనుపై బలంగా దాడి చేసి గాయపరిచాయి. కుటుంబ సభ్యులు అతన్ని చికిత్స కోసం విజయనగరం మహారాజ ఆస్పత్రిలో చేర్పించారు. కొద్ది రోజులు ఆస్పత్రిలో చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ ఈ నెల 10న శ్రీను మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు పెద్ద మనసుతో శ్రీను నేత్రాలతో మరొకరికి కంటి చూపు ప్రసాదించాలని సంకల్పించారు. కేజీహెచ్ మార్చురీలో శ్రీను మృతదేహానికి గురువారం పోస్టుమార్టం నిర్వహించి.. అతని నేత్రాలను హనుమంతువాక వద్ద ఉన్న ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌కు అప్పగించారు. ఈ మేరకు ధ్రువీకరణపత్రాన్ని ఎల్.వి ఆస్పత్రి యాజమాన్యం శ్రీను కుటుంబ సభ్యులకు అందజేసింది.

నేల బావిలో పడి రైతు దుర్మరణం



రైతు కర్రి రాజు మృతదేహం

కశింకోట: నేల బావిలో ప్రమాదవశాత్తు పడి రైతు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని పరవాడపాలెం గ్రామంలో గురువారం జరిగింది. ఇందుకు సంబంధించి ఏఎస్ఐ శంకరరావు అందజేసిన వివరాలిలా ఉన్నాయి. పరవాడపాలెంలో కర్రి రాజు (48) వ్యవసాయం సాగిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఎప్పటిలాగే పంట పొలానికి వెళ్లి నేల బావిలో నీళ్లు తోడుతుండగా ప్రమాదవశాత్తూ కాలు జారింది. దీంతో బావిలో పడి ఈత రాకపోవడంతో మృతి చెందాడు. ఇద్దరు కుమార్తెలున్నారు. ఈమేరకు భార్య పైడమ్మ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు ఏఎస్ఐ తెలిపారు.

పలు రైళ్లు రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం: పలు స్టేషన్లకు రైళ్లు ఆలస్యంగా చేరుకున్నందున ఆయా స్టేషన్‌ల నుంచి గురువారం పలు రైళ్లు ఆలస్యంగా బయల్దేరాయి. ఈ రైళ్లు అంతే ఆలస్యంగా ఆయా స్టేషన్‌లకు చేరుకోనున్నాయి. ఎస్ఎంవీ బెంగళూరులో గురువారం ఉదయం 10.35గంటలకు బయల్దేరాల్సిన ఎస్ఎంవీ బెంగళూరు– హౌరా(12864)సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సుమారు 9గంటలు ఆలస్యంగా రాత్రి 7.30గంటలకు బయల్దేరింది. షాలిమర్‌లో గురువారం సాయంత్రం 3.20 గంటలకు బయల్దేరాల్సిన షాలిమర్– ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (12841) కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ రెండు గంటలు ఆలస్యంగా సాయంత్రం 5.20గంటలకు బయల్దేరింది.

ఆటోడ్రైవర్ దాడిలో వృద్ధుడి మృతి

- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన



మృతుడు దేవుడు

గోపాలపట్నం: మద్యం మత్తులో ఆటోడ్రైవర్ ఓ వృద్ధుడిపై దాడి చేసి.. అతని మరణానికి కారణమయ్యాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన చంద్రానగర్‌లో చోటు చేసుకుంది. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలివీ.. చంద్రానగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ అక్కరబోయిన శ్రీధర్ ఈ నెల 4వ తేదీ సాయంత్రం మద్యం సేవించి వీధిలో వీరంగం సృష్టించాడు. ఎప్పుడూ తాగి తిడుతుంటావ్ అంటూ అదే ప్రాంతానికి పునుగంటి పాలమ్మ ఆగ్రహం వ్యక్తం చేయగా.. ఆమెపై శ్రీధర్ రాయితో దాడికి పాల్పడ్డాడు. అక్కడే ఉన్న ఆమె తండ్రి దేవుడు(70) దీనిని అడ్డుకునేందుకు యత్నించగా.. అతన్ని శ్రీధర్ రాయితో బలంగా కొట్టాడు. ఈ ఘటనలో గాయాలపాలైన దేవుడును స్థానికులు కేజీహెచ్‌లో చేర్పించారు. అక్కడే చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందాడు. ఈ దాడిలో పాలమ్మకు కూడా గాయాలయ్యాయి. దేవుడు గేదెలు కాస్తూ పాలు అమ్ముకుని జీవనం సాగిస్తున్నాడు. దాడి అనంతరం నిందితుడు పరారయ్యాడు. మృతుడి కుమార్తె ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ సురేష్ ఆధ్వర్యంలో ఎస్ఐ అప్పలనాయుడు నెల్లూరులో ఉన్న నిందితుడు శ్రీధర్‌ను అదుపులోకి తీసుకుని.. గురువారం రిమాండ్‌కు తరలించారు.

కుటుంబ ప్రణాళిక గర్వకారణం



ఎన్టీఆర్ వైద్యాలయం నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, వైద్యసిబ్బంది

అనకాపల్లి : అభివృద్ధి చెందిన భారతదేశానికి కొత్త గుర్తింపు కుటుంబ ప్రణాళిక అనేది ప్రతి దంపతులకు గర్వ కారణమని, చిన్న కుటుంబం చింతలేని కుటుంబమని డీసీహెచ్ఎస్ శ్రీనివాసరావు, డీఎంఅండ్‌హెచ్‌వో బాలాజీ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయం నుంచి నెహ్రూచౌక్ వరకూ తమ సిబ్బందితో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుటుంబ నియంత్రణకు తాత్కాలిక, శాశ్వత పద్ధతులు పాటించాలని, వివాహానికి ఎందుకు తొందర–బడికి వెళ్లు ముందర, లింగ సమానత్వం, జనాభా పెరుగుదల వల్ల కలుగు సమస్యలు తదితర అంశాలపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పేద విద్యార్థినులకు ఉచిత సైకిళ్ల పంపిణీ



విద్యార్థినులకు సైకిళ్లు అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు గోపాలరావు, సన్యాసిపాత్రుడు, రాఘవేంద్రరావు

నర్సీపట్నం : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పేద విద్యార్థినులకు లయన్స్ క్లబ్ వారు గురువారం ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశారు. వీటిని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ అధికారి గోపాలరావు, క్లబ్ ప్రతినిధులు చింతకాయల సన్యాసిపాత్రుడు, డి.రాఘవేంద్రరావు, రఘు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద విద్యార్థినులకు చేయూతనందించాలనే సంకల్పంతో ఉచితంగా సైకిళ్లు అందజేశామన్నారు. కళాశాలకు రావడానికి ఇబ్బంది పడుతున్న 35 విద్యార్థినులను గుర్తించి సైకిళ్లు ఇచ్చామన్నారు. లయన్స్ క్లబ్ కళాశాలను దత్తత తీసుకున్నందున విద్యాభివృద్ధికి అనేక సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. విద్యార్థులు చదువులో రాణించేందుకు వీలుగా రూ.25 లక్షలతో ఆధునాతన గ్రంథాలయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. క్లబ్ అందిస్తున్న సేవలను విద్యార్థినులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ప్రయోజకులు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రిన్సిపాల్ డా. బి.వి. పద్మావతి, సీనియర్ అధ్యాపకులు జి.చిన్నారావు మాట్లాడుతూ తమ కళాశాలను క్లబ్ వారు దత్తత తీసుకోవడం విద్యార్థులకు వరమన్నారు. ప్రతి ఏటా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించి ఉన్నత విద్యలో రాణించేందుకు ప్రోత్సాహన్ని ఇస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సెయిల్‌లో విలీనంతోనే సమస్యలకు శాశ్వత పరిష్కారం



స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాల నాయకులతో సమావేశమైన కేంద్ర మంత్రులు

- కేంద్ర మంత్రికి వినతి



కేంద్ర మంత్రులకు వినతిపత్రం అందజేస్తున్న ఉక్కు అధికారుల సంఘం నాయకులు

ఉక్కునగరం : సెయిల్‌లో స్టీల్‌ప్లాంట్ విలీనం చేయడంతోనే స్టీల్‌ప్లాంట్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, ఆ దిశంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఉక్కు అధికారుల సంఘం (సీ), ఉక్కు పోరాట కమిటీ నాయకులు కోరారు. స్టీల్‌ప్లాంట్ పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి కుమారస్వామి, సహాయ మంత్రి బి.శ్రీనివాసవర్మలను ఉక్కు పరిపాలన భవనంలో సీ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం వర్కింగ్ క్యాపిటల్ లేకపోవడం వల్ల ఉత్పత్తి తగ్గిందని, సొంత గనులు లేకపోవటం వల్ల ఉత్పత్తి వ్యయం పెరుగుతుందన్నారు. సాలీనా ఇది రూ.3 వేల కోట్లని, విస్తరణ కోసం చేసిన అప్పుల వల్ల వడ్డీ భారం ఏడాదికి రూ.1800 కోట్లు అవుతుందన్నారు. తక్షణమే పూర్తి సామర్థ్యంతో నడిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా అధికారుల పదోన్నతులు, వేతన సవరణ గురించి వివరించారు.

విలీనం వల్ల ఇరు సంస్థలకు లాభం
పోరాట కమిటీ నాయకులు అందజేసిన వినతిపత్రంలో సెయిల్‌లో విలీనం చేయడం వల్ల విశాఖ ఉక్కుకు ముడి సరుకుల భద్రత లభిస్తుందన్నారు. విలీనం వల్ల ఇరు సంస్థలకు లాభదాయకమన్నారు. ప్రస్తుత ప్లాంట్ గడ్డు పరిస్థితి దాటడానికి అవసరమైన వర్కింగ్ క్యాపిటల్, ప్రిఫరెన్షియల్ షేర్స్, లెటర్ ఆఫ్ కంఫర్ట్ వంటి ప్రతిపాదనలను ఆమోదించాలని కోరారు. అదే విధంగా ఎన్ఎండీసీ నుంచి రెండేళ్ల రుణ వ్యవధితో ఐరన్ ఓర్ సరఫరా జరిగేలా చూడాలన్నారు. నూతన వేతనాలు అమలు చేయకపోగా సకాలంలో జీతాలు చెల్లించకుండా ఉద్యోగులను సీఎండీ ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. సమావేశంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, కె.ఎస్.ఎన్.రావు, రామ్మోహన్‌కుమార్, కర్రి దాలినాయుడు, పెడిరాజు, త్రినాథరావు, వరసాల శ్రీనివాసరావు, బి.డేవిడ్, డి.సురేష్‌బాబు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నారసింహునిగా జగన్నాథుడు

కశింకోట: దేవదాయ శాఖకు చెందినరుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో జగన్నాథస్వామి ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్నాథ స్వామిని నరసింహావతారంలో అలంకరించి విష్ణు సహస్ర నామార్చన చేశారు. భక్తుల గోత్ర నామాలతో పూజలు జరిపారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు రేజేటి సీతారామాచార్యులు, మారుతి, శ్రీరామ చరణాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, స్వామివారిని దర్శించుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఏపీఈపీడీసీఎల్ కశింకోట డివిజన్ ఈఈ ఎస్.రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో నరసింగబిల్లితోపాటు నూతలగుంటపాలెం, గొబ్బూరు, తాళ్లపాలెం, పరవాడపాలెం, ఉగ్గినపాలెం, కొత్తపల్లి, ఏఎస్‌పేట, సోమవరం, కన్నూరుపాలెం, తీడ, చెరకాం, సుందరయ్యపేట, జి.భీమవరం, అచ్చెర్ల, మోసయ్యపేట, ఏనుగుతుని గ్రామాల్లో నిర్దేశించిన సమయంలో విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

142 మందికి ఉచిత కంటి పరీక్షలు

పాయకరావుపేట : వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలో గల పాండురంగ దేవస్థానం ఆవరణలో ఉచిత వైద్య శిబిరం చేసినట్లు హైమ నేత్రాలయ వైద్యుడు శివరామ్ ప్రసాద్ తెలిపారు. 142 మందికి వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు డి.ఎస్.మూర్తి, కండపల్లి జోసెఫ్, యోగా ఉపాధ్యాయుడు వి.ప్రసాద్ పాల్గొన్నారు.

కాస్త తగ్గిన ఉల్లి ధర

కశింకోట: స్థానిక వారపు సంతలో గురువారం ఉల్లిపాయ ధర కాస్త తగ్గింది. గత వారం కిలో రూ.50 ఉండగా, ఈ వారం రూ.40కి విక్రయాలు జరిగాయి. బెండకాయ, వంకాయ, దొండకాయలు కూడా ఇదే ధరకు అమ్మకాలు సాగాయి. టమాటా రూ.50, గోరు చిక్కుడు, క్యారెట్, బీట్రూట్ రూ.60, బీన్స్ రూ.80, క్యాప్సికం రూ.100, పచ్చిమిర్చి రూ.120, అల్లం రూ.220కి విక్రయాలు జరిగాయి.

అనకాపల్లి సినిమాలు

మహారాజ	:రాజా
కల్కి 2898 ఏడీ	:సత్యనారాయణ స్క్రీన్-1
కల్కి 2898 ఏడీ	:సత్యనారాయణ స్క్రీన్-2
భారతీయుడు 2	:షిర్డిసాయి
భారతీయుడు 2	:పర్తిసాయి
మనమే	:వెంకటేశ్వర
14	:శ్రీసత్య
సారంగదరియా	:రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 24 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	--	--
రెండో రకం	3,900	3,900
మూడోరకం	3,600	3,350

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 47 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-19 యూనిట్లు, ఓ పాజిటివ్-23 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 395 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 354 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.



నా పేరు కె.కనకమహాలక్ష్మి. మాది అనకాపల్లి మండలం, శంకరం గ్రామం. మాకు ముగ్గురు పిల్లలు. ఇద్దరు పిల్లలు అనకాపల్లి రింగ్‌రోడ్డులోని గురజాడ పబ్లిక్ స్కూల్లో చదువుతున్నారు. పెద్దోడు అనిషిత్ ఐదో తరగతి, పెద్ద కూతురు ఖ్యాతి మూడో తరగతి చదువుతున్నారు. చిన్నది ఎల్‌కేజీ చదువుతోంది. ఇద్దరు పిల్లకు ఏడాదికి సుమారు రూ.లక్ష చదువుకు ఖర్చవుతోంది. ఇప్పటికే సగం డబ్బులు కట్టేశాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పెద్దోడికి రూ.15 వేలు వచ్చేది. కూటమి ప్రభుత్వంలో తల్లికి వందనం పేరిట ఎంత మంది పిల్లలుంటే అన్ని రూ.15 వేలు చొప్పున ఇస్తామన్నారు. ఇద్దరు పిల్లలకూ రూ.30 వేలు వస్తుందనుకున్నాం. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి.



కశింకోటలోని గవరపేటకు చెందిన యల్లపు అరుణకు ఇద్దరు పిల్లలు. స్థానిక ప్రైవేట్ స్కూల్లో కుమార్తె కుజన్య 5వ తరగతి, కుమారుడు నవనీత్ 2వ తరగతి చదువుతున్నారు. వీరిలో కుమార్తెకు గత ప్రభుత్వంలో మూడేళ్లు అమ్మ ఒడి ఆర్థిక సాయం అందింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తల్లికి వందనం పేరిట ఇద్దరు పిల్లలకూ చెరో రూ.15 వేలు చొప్పున రూ.30 వేలు ఆర్థిక సాయం అందుతుందని ఆశపడ్డారు. ఆ భరోసాతోనే ఇద్దరు పిల్లల్నీ ప్రైవేట్ స్కూల్లో చేర్పించారు. ఇంకా తల్లికి వందనం లబ్ధి చేకూరలేదు. ఓ వైపు పిల్లల ఫీజులు చెల్లించడం భారంగా మారింది. ఇప్పుడు తల్లికి వందనం జీవోలో ప్రతి తల్లికి రూ.15 వేలు ఇస్తామనడంతో అవాక్కయ్యారు.

బాబూ.. నిన్ను నమ్మి మళ్లీ మోసపోయాం!

'యూ టర్నుల చంద్రబాబు మళ్లీ మొదలెట్టేశారు. ప్రపంచంలో రంగులు మార్చని ఊసరవెల్లి ఉంటుందేమో గానీ.. మాట మార్చని చంద్రబాబును మచ్చుకైనా ఊహించుకోలేం. ఇవే నాకు చివరి ఎన్నికలు. ఒక్క అవకాశం ఇవ్వండి.. ఇచ్చిన ప్రతి హామీ అమలు చేస్తానన్న బాబును నమ్మి మళ్లీ మోసపోయాం'. ఇదీ తల్లికి వందనం జీవో విడుదల తర్వాత అనకాపల్లి నియోజకవర్గంలోని ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థుల తల్లుల మనోగతం.



- తల్లికి వందనం జీవోలో మెలికపై తల్లుల ఆవేదన
- ఎంత మంది పిల్లలున్నా లబ్ధి ఒక్కరికేనా?

అనకాపల్లి/కశింకోట: ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుకున్నా.. అందరికీ చెరో రూ.15 వేలు చొప్పున తల్లికి వందనం పథకం లబ్ధి చేకూర్చుతానని హామీలు గుప్పించిన బాబు.. తీరా అధికారంలోకి వచ్చాక నాలుక మడతెట్టారు. అవే పలుకులు పలికి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ కూడా చంద్రబాబు హామీలకు వత్తాసుగా నిలిచారు. పిల్లల లెక్కలు తీసేసి కేవలం ఒక్కో తల్లికి రూ.15 వేలు ఇవ్వనున్నట్లు జీవో నెం.29 పేరిట బుధవారం మార్గదర్శకాలు జారీ చేశారు. దీనిపై నియోజకవర్గంలోని విద్యార్థుల తల్లుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బాబును నమ్మి మరోసారి మోసపోయామంటూ వాపోతున్నారు.

ఆ డబ్బులు ఎప్పుడిస్తారో..?



నాకు ఇద్దరు కుమార్తెలు. కశింకోటలోని గవర్నమెంట్ స్కూల్లో పెద్ద కూతురు అమృతవల్లి 5వ తరగతి, చిన్న కూతురు సింధుప్రియ 3వ తరగతి చదువుతున్నారు. జగన్ ప్రభుత్వంలో అమృతవల్లికి అమ్మ ఒడి ఆర్థిక సాయం అందేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే చదువుకున్న విద్యార్థులందరికీ తల్లికి వందనం పేరిట ఏడాదికి రూ.15 వేలు ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించారు. ఆ డబ్బులు ఎప్పుడెప్పుడు వస్తాయా? అని ఆశగా ఎదురు చూస్తున్నాం ఆ డబ్బులతో పిల్లల అవసరాలకు ఇబ్బంది ఉండదని ఆశ.

–వేగి రమాదేవి, కశింకోట

నా ఇద్దరు పిల్లలకూ ఇవ్వాలి



నాకు ఇద్దరు కుమార్తెలు. పట్టణంలోని వాసవీ బాల విహార్ స్కూల్లో పెద్దది జాహ్నశ్రీ 6వ తరగతి, చిన్న కుమార్తె లహరికశ్రీ 3వ తరగతి చదువుతున్నారు. ఇద్దరికీ రూ.45 వేలు స్కూల్ ఫీజులు కడుతున్నాం. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇంటిలో ఎంత మంది పిల్లలు చదువుకుంటే అంత మందికి తల్లికి వందనం పథకంలో చెరో రూ.15 వేలు చొప్పున ఇస్తామన్నారు. ఇచ్చిన హామీ మేరకు మా ఇద్దరు కుమార్తెలకు రూ.30 వేలు వస్తుందని ఆశిస్తున్నాం.

– ఒడిశెట్టి జ్యోతి, కోట్ని వీధి, అనకాపల్లి టౌన్

సూపర్ సిక్స్ మాటేంటి?



నాకు ఇద్దరు కుమార్తెలు. భార్యభర్తలు ఇద్దరం ప్రైవేట్ కంపెనీల్లో పనిచేస్తున్నాం. పెద్దకుమార్తె జానకి ఏపీ మోడల్ స్కూల్లో ఆరో తరగతి చదువుతోంది. చిన్న కుమార్తె పట్టణంలోని రింగ్‌రోడ్డు గురజాడ పబ్లిక్ స్కూల్లో ఒకటో తరగతి చదువుతోంది. చిన్న కుమార్తెకు ఏడాదికి రూ.20 వేలు ఫీజు. తల్లికి వందనం పథకం స్కూళ్లు తెరిచినపుడే ఇచ్చినట్లయితే ఎంతో బాగుంటుంది. ఒక్కో బిడ్డకు రూ.15 వేలు చొప్పున తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అందిస్తామని, ఎన్నికల ముందు చంద్రబాబు సూపర్‌సిక్స్‌లో హామీ ఇచ్చారు. ఆ డబ్బులు కోసం ఎదురు చూస్తున్నాం.

– భీశెట్టి రూప, మళ్లవీధి, అనకాపల్లి

నకిలీ డ్వాక్రా గ్రూపులతో రూ.15 లక్షలు కాజేత



సమావేశంలో మాట్లాడుతున్న దాకారపు వరలక్ష్మి

- బాధ్యులపై చర్యలు తీసుకోవాలి : ఐద్వా డిమాండ్

అనకాపల్లి: మండలంలోని సత్యనారాయణపురం, కొత్తూరు పంచాయతీ పరిధిలో నకిలీ డ్వాక్రా గ్రూప్‌లను సృష్టించి రూ.15 లక్షలు కాజేసిన బ్యాంకు ఉద్యోగులతోపాటు అందుకు సహకరించిన అన్ని శాఖల అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా కార్యదర్శి దాకారపు వరలక్ష్మి డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఐద్వా ఆధ్వర్యంలో డ్వాక్రా సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సత్యనారాయణపురంలో డ్వాక్రా సంఘాలకి సంబంధిత సీఏ మంగతాయారు ఫేక్ గ్రూపులు సృష్టించినట్లు ఆరోపించారు. అసలు అక్కౌంట్ లేని వ్యక్తికి బ్యాంకు రుణాలు మంజూరు చేయించి, బినామీ గ్రూప్ పేర్లతో శ్రీనిధి, ముద్ర తదితర రుణాలు ద్వారా నగదు కాజేసిందన్నారు. దీనిపై అధికారులు పట్టించుకోకపోవడాన్ని ఆక్షేపించారు. అసలు గ్రూప్ ఏదో, ఫేక్ గ్రూప్ ఏదో తెలియని అయోమయంలో బ్యాంకుల వద్దకు వెళ్లి అడిగితే తమకు సంబంధం లేని సిబ్బంది చెప్పడం శోచనీయమన్నారు. బాధ్యులైన వెలుగు సీఏలు, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, యూనియన్ బ్యాంక్ బ్రాంచిల సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా సహాయ కార్యదర్శి ఆర్.లక్ష్మి, ప్రతినిధులు యు.నాగమణి, యు.లోవ, ఎస్.రాణి, దుర్గ, రేవతి, నూకరత్నం, నాగమణి, నిర్మల, ధనలక్ష్మి, నాగరత్నం, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

27, 28 తేదీల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ



జిల్లా సమావేశాల గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

అనకాపల్లి: బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గీతాకృష్ణ, ఎం.రమణ కోరారు. స్థానిక దొడ్డి రాము నాయుడు భవనంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాల గోడ పత్రికలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ నిరంతర పోరాటాలు చేస్తోందన్నారు. నీట్ ప్రశ్నాపత్రం అవకతవకలపై వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి, విద్యార్థులను చైతన్య పరిచేందుకు కృషి చేస్తోందన్నారు. డ్రగ్స్ మహమ్మారిని విద్యా సంస్థల నుంచి తరిమి కొట్టేందుకు విద్యార్థులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ విద్యని ప్రైవేటీకరణ చేయాలని చూస్తోందని, యూనివర్సిటీలకు నిధులు తగ్గించేస్తున్నారని ఆరోపించారు. అనకాపల్లి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ లేకపోవడంతో వేలాది మంది గ్రామీణ యువత ప్రైవేట్ కాలేజీలకు వెళ్లలకే చదువుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనకాపల్లి పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలలకు సకాలంలో పుస్తకాల పంపిణీ జరగలేదని, దీంతో చదువులు కుంటుపడుతున్నాయన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల్ని తక్షణమే భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ఎస్.రమణ, కె.ఆదికేశవ, అభిషేక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జనాభా నియంత్రణపై అవగాహన ర్యాలీ



ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీ కశింకోట పీహెచ్‌సీ సిబ్బంది



జనాభా దినోత్సవ ర్యాలీలో పాల్గొన్న తాళ్లపాలెం పీహెచ్‌సీ ఆరోగ్య సిబ్బంది

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం, కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. కశింకోట పీహెచ్‌సీలో వైద్యాధికారి ఎస్.తిరుపతిరావు ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది జనాభా దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. జనాభా పెరుగుదల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. జనాభా నియంత్రణకు కుటుంబ నియంత్రణ అమలు తప్పనిసరన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి సత్యనారాయణ, సిబ్బంది సత్యవతి, విజయలక్ష్మి, పాడి మెడికల్ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. తాళ్లపాలెం పీహెచ్‌సీలో వైద్యాధికారి యు.రమేష్ ఆధ్వర్యంలో జనాభా దినోత్సవ ర్యాలీ నిర్వహించి ప్రజలకు కుటుంబ నియంత్రణ పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య బోధకుడు ఎంఎస్‌వీ ప్రసాద్, ఆరోగ్య విస్తరణాధికారి వీపీ సుబ్బారావు, ఆరోగ్య కార్యకర్తలు ఆర్‌వీవీ సత్యనారాయణ, డి.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

అధిక జనాభాతో అనర్థం



డీపీఎన్ హైస్కూల్లో విద్యార్థుల విన్యాసం

కశింకోట: స్థానికడీపీఎన్ జెడ్పీ హైస్కూల్లో ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకుని గురువారం విద్యార్థులు నిర్వహించిన విన్యాసం ఆహూతుల్ని విశేషంగా ఆకట్టుకుంది. విద్యార్థులు చుట్టూ కూర్చొని అధిక జనాభా వల్ల కలిగే నష్టాలను వివరించారు.

హెచ్ఎం ఎంఆర్‌వీ అప్పారావు అధిక జనాభా మానవ మనుగడకు అనర్థదాయకమన్నారు. కార్యక్రమంలో పాఠశాల పీడీ వి.ప్రభాకరరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

చెరువు మట్టి పనుల ప్రారంభం



ఎన్ఆర్ఈజీఎస్ పనులను ప్రారంభించిన సర్పంచ్ దేవి వెంకటరమణ

పరవాడ: తానాం గ్రామంలో దుంగలవాని చెరువులో ఎన్ఆర్ఈజీఎస్ పనులకు ప్రభుత్వం రూ.10 లక్షల మంజూరు చేసిందని సర్పంచ్ కన్నూరిదేవి వెంకటరమణ చెప్పారు. మంజూరైన నిధులతో చెరువులో చేపట్టిన మట్టి పనులను గురువారం ప్రారంభించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వర్రి మంగలక్ష్మివసంతరావు, నాయకులు పైల లలిత దేముడు బాబు, చీపురుపల్లి కృష్ణవేణి, జి.సన్యాసినాయుడు, ఆర్.లక్ష్మిదేవి, ఆర్.రమ్య, జి.సతీష్, వి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వామనావతారంలో జగన్నాథుడు



జగన్నాథుడిని దర్శించుకుంటున్న భక్తులు



ఆకట్టుకున్న కోలాటం

మునగపాక : సుబద్ర, బలభద్ర సమేత జగన్నాథ స్వామి గురువారం భక్తులకు వామనావతారంలో దర్శనమిచ్చారు. ఉదయం నుంచి మునగపాక, నాగులాపల్లి గ్రామాల్లోని జగన్నాథున్ని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. ఈ నెల 17న జగన్నాథస్వామి పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

గ్రామాభివృద్ధికి సహకరించండి



మాట్లాడుతున్న మునగపాక సర్పంచ్ అప్పారావు

మునగపాక: మునగపాక గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ రాజకీయాలకు అతీతంగా సహకరించాలని సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో గురువారం జరిగిన గ్రామసభలో మాట్లాడారు. పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణ, తాగునీటి సరఫరా వంటి విషయంలో ప్రజలకు అందుబాటులో సేవలందిస్తున్నామన్నారు. అవసరమైన చోట రహదారులు, డ్రైన్లు, కల్వర్టులు, గ్రావెల్ రహదారులు నిర్మించామన్నారు. పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, ఉప సర్పంచ్ పెంటకోట సత్యనారాయణ, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ముసిలినాయుడు, జనసేన మండల అధ్యక్షుడు పరశురామ్, వార్డు సభ్యుడు అప్పలనాయుడు, ఎంపీటీసీ గణేష్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు రామ్మోహనరావు పాల్గొన్నారు.

ఐఐఐటీకి ముగ్గురు విద్యార్థినుల ఎంపిక



విల్లూరి యామిని



టెక్కలి జయశ్రీ



భీశెట్టి గీత

మునగపాక : మునగపాకకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఐఐఐటీలకు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన పదోతరగతి పరీక్ష ఫలితాల్లో మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులు పలు ప్రాంతాల్లోని ఐఐఐటీలకు ఎంపికైనట్టు ఎంఈవో వేణుగోపాలరావు తెలిపారు. విల్లూరి యామిని, టెక్కలి జయశ్రీలు ఒంగోలులోని ఐఐఐటీకి, భీశెట్టి గీత శ్రీకాకుళంలోని ఐఐఐటీకి ఎంపికయ్యారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన ముగ్గురు విద్యార్థులు ఐఐఐటీకి ఎంపిక కావడం పట్ల ఆయా కుటుంబ సభ్యులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏకాగ్రతతో చదువుకోవాలి



విద్యార్థులకు యూనిఫారం అందజేస్తున్న మునగపాక సర్పంచ్ అప్పారావు

మునగపాక : విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకోవాలని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. దళితవాడలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం యూనిఫారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో బోధన జరుగుతుందని, అందువల్ల తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పీఎంసీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదువుకుంటే ఉజ్వల భవిష్యత్



పదిలో మెరిట్ సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

మునగపాక : సరైన ప్రణాళిక ఉంటే చదువులో రాణించవచ్చని ప్రముఖ సైకాలజిస్టు జె.ఎస్.వి.రావు తెలిపారు. తిమ్మరాజుపేట జెడ్పీ హైస్కూల్లో గురువారం తోసా ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన నిర్వహించారు. ఇష్టపడి కష్టపడి చదువుకుంటే పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. ఏటా క్రమం తప్పకుండా తోసా ఆధ్వర్యంలో విద్యాభివృద్ధికి అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. అంతర్జాతీయ గోల్డ్ మెడలిస్టు కళాధరరావు మాట్లాడుతూ యోగాతో మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెరుగుతుందన్నారు. అనంతరం టెన్త్‌లో మెరిట్ సాధించిన విద్యార్థులకు బహుమతులు, స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. తోసా అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటప్పారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భీమరశెట్టి శ్రీనివాసరావు, ఎంపీటీసీ అప్పలనరసమ్మ, తోసా కార్యదర్శి దాడి వెంకట దుర్గారావు, కోశాధికారి అప్పలనాయుడు, శరగడం వెంకట రెడ్డినాయుడు, గురునాథ్, కొయిలాడ శివాజీ, సాయిరాం, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

గొర్రెలు, మేకలకు వ్యాధి నిరోధక టీకాలు



పశువ్యాధి టీకాలు వేస్తున్న దృశ్యం

మునగపాక : మండలంలోని గొల్లలపాలెంలో గురువారం గొర్రెలు, మేక పోతులకు పశు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. పేడ పరీక్షలు, రక్తపరీక్షలు జరిపారు. సీజన్‌లో పశువులు, మేకల్లో బ్రూ సెల్లోసిస్ వ్యాధి సోకుతుందని ఇందుకు పశువుల యజమానులు, పాడి రైతులు తగు పరీక్షలు చేయించి, నివారణ చర్యలు తీసుకోవాలని పశువైద్యాధికారి లావేటి ప్రదీప్‌కుమార్ సూచించారు. వ్యాధి నిర్ధారణ అయిన పశువులను మంద నుంచి వేరు చేయాలన్నారు. కొత్తగా కొనుగోలు చేసిన పశువులను వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయకుండా మందలో కలపకూడదని తెలిపారు.

నేడు పెన్షనర్ల సంఘం సమావేశం

యలమంచిలి రూరల్ : యలమంచిలి తాలూక స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ సర్వ సభ్య సమావేశం శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎన్‌జీవో హోమ్‌లో జరుగుతుందని సంఘం అధ్యక్షుడు సీహెచ్ సోమేశ్వరరావు మీడియాకు తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వి.జగన్నాథరావు, జిల్లా జనరల్ సెక్రటరీ బీవీఎల్ఎస్ శర్మ, విశాఖ జిల్లా కార్యదర్శి మూర్తి సమావేశానికి హాజరవుతారన్నారు.

డయేరియా బాధితులకు పరామర్శ

అచ్యుతాపురం: మోటూరుపాలేనికి చెందిన డయేరియా బాధితుల్ని సీపీఎం నాయకులు కేజీహెచ్‌లో పరామర్శించారు. ఈ మేరకు కేజీహెచ్‌కు సీపీఎం నాయకుడు ఆర్.రాము వెళ్లి గురువారం పరామర్శించారు. చిన్నారి జనార్దన్ తల్లిదండ్రులతో మాట్లాడారు.